# నైపుణ్యం !

ముక్కులతో, మూలుగులతో, దెబ్బలతో, బొబ్బలతో నిండిపోయిన ఖజానా లాగా వుంది  నర్సింగ్‌హోం. చెయ్యి విరిగిన ఆర్టిస్ట్ బ్రహ్మాజీ, ఓ కార్నర్ బెడ్ మీద నుంచి "మైడియర్ ఫ్రెండ్స్! ఈ రోజు మీకో అద్భుతమైన కథ చెప్తాను. జాగ్రత్తగా ఆలకించండి" అంటూ ఇలా చెప్పసాగాడు.

"వెనుకటికి బోన్ బోన్ దేశంలో అన్నీ ఎముకల జీవులే తప్ప కండగల ప్రాణి ఒక్కటీ వుండేది కాదు. ఏనుగు అనే జంతువు అక్కడ ఎవరికీ తెలీదు. ఏనుగులు చాలా బలమైన ప్రాణులనీ, చాలా పనులుచేసి పెడతాయనీ, యుద్ధాల్లో కూడా ఉపయోగిస్తాయని యిలా పోను పోను వార్తలందసాగాయి. బోన్ బోన్ దేశపు రాజుగారికి రాన్ రాను ఆయన ఓపిక నశించి పోయింది.

"వెంటనే తన ఆస్థానంలోని నలుగుర్ని పిలిచి, దూరదేశమైన ఫన్ ఫన్ దేశం వెళ్ళి ఏనుగెలా వుంటుందో చూసి వచ్చి తనకి వర్ణించి చెప్పవలసిందిగా అడిగాడు.

వాళ్ళు నలుగురూ ప్రభూ! అదెంతపని? అసలు మేము చూడటమెందుకు? అలా చేత్తో తాకినా చాలు. దాని స్వరూప స్వభావాలు కళ్ళకు కట్టినట్టు చెప్పేయ్యగలం" అని భారీగా దారిభత్యం పుచ్చుకుని బయలు దేరారు.

ఫన్ ఫన్ దేశం వెళ్ళారు. ఏనుగును చూడటానికి  ఆరాజుగారి దగ్గర అనుమతి సంపాదించారు. ఆయన దగ్గరా ఒకే ఒక ఏనుగుంది. దానికి వేరే గజశాల వుంది. అక్కడికి వెళ్ళీ వెళ్ళంగానే మేధావులు నలుగురు తన ఎక్స్‌రే కళ్ళని తెరిచారు.

ఒకడు ఏనుగు తోక పట్టుకున్నాడు.

మరొకడు ఏనుగు కాలు పట్టుకున్నాడు.

మరొకడు ఏనుగు కడుపు స్పృశించాడు.

ఇంకొకడు ఏనుగు తొండం తాకాడు.

తెలిసిందంటే తెలిసిందనుకున్నారు. ఫన్ ఫన్ దేశం రాజుగారికి కృతజ్ఞతలు తెలియజెప్పుకున్నారు. తిరిగి బోన్ బోన్ దేశం బయలుదేరారు.

ఎవరి దారిని వాళ్ళు విడివిడిగా రాజ దర్శనం చేసుకున్నరు.

"మహారాజా! ఏనుగు సన్నగా, పొట్టిగా, చివర్లలో వెంట్రుకలుండి, గట్టి తాడు లాగా వుంటుంది." అన్నాడొకడు.

"మహారాజా! ఏనుగు లావుగా, పొడుగ్గా, పైనుంచి కిందికి, స్తంభం లాగా వుంటుంది." అన్నాడు మరొకడు.



"మహాప్రభూ! ఏనుగు గుండ్రంగా, నున్నగా గుండిగ లాగా వుంటుంది" అన్నాడు వేరొకడు.

"రాజాధిరాజా! ఏనుగు క్రింద సన్నగా, పైన లావుగా గదలాగా, వుంటుంది". అన్నాడింకొకడు.

నలుగురి వర్ణనా విన్న రాజు కేమీ అర్థం కాలేదు. అయోమయంలో పడిపోయాడు. కాని వాళ్ళనేమీ అనడానికి వీల్లేదు. అందుకని ఆనందంగా కానుకలతో సత్కరించి పంపేశాడు.

ఆ నలుగురూ ఎవరో, మీలో ఎవరైనా చెప్పగలరా?" అని ముగించాడు బ్రహ్మాజీ!

"ఆ నలుగురూ గుడ్డివాళ్ళు కదా!" అనుకున్నారు. అనడానికి తగిన ఓపికలేని పేషెంట్లంతా.

"నేను చెప్పగలను బ్రహ్మాజీగారూ" అన్నాడు నీరసంగా నవ్వుతూ ఆనందం. ఒకే విషయం నలుగురూ నాలుగు విభిన్నమైన అభిప్రాయాలు వెలిబుచ్చారూ అంటే నిస్సందేహంగా వాళ్ళు "స్పెషలిస్టులు".

"కరెక్ట్" అంటూ ఆనందం తెలివికి బ్రహ్మానంద పడిపోయాడు ఆర్టిస్ట్ బ్రహ్మాజీ.

వెనుక గార్డెన్‌లోని హైబిస్కస్ కెనాబినస్ (గోంగూర) పువ్వు - చూపుడు వేలు ఆడిస్తున్నట్టుగా గాలికి కదలసాగింది.